ఢిల్లీలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాసోజు శ్రవణ్ తదితరులు

మహోన్నత స్వాప్నికుడు జయశంకర్ సార్

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): మహోన్నత స్వాప్నికుడు జయశంకర్ అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సార్ జయంతి సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'జయశంకర్ సార్ మార్గంలో, కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ ప్రత్యేక స్థానం. జయహో జయశంకర్ సర్ పిడికిలెత్తి పలుకుతుంది తెలంగాణ జోహార్' అంటూ ఆయన ట్వీట్ చేశారు.

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మధుసూదనాచారి, నవీన్, శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, దేవీప్రసాద్, రాకేశ్, నగేశ్, ఆంజనేయగౌడ్ తదితరులు

జయశంకర్ సార్ స్ఫూర్తితోనే కేసీఆర్ పాలన

- **అన్నివర్గాల సంక్షేమానికి పునాదులు**
- **పరంపరను కాంగ్రెస్ సర్కార్ కొనసాగించాలి**
- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **ఢిల్లీలో జయశంకర్ జయంతి వేడుకలు**

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ స్ఫూర్తితో కేసీఆర్ పదేండ్ల పాలన సాగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి కేసీఆర్ బలమైన పునాదులు వేశారని, ఆ పరంపరను కాంగ్రెస్ సర్కార్ కొనసాగించినప్పుడే సార్‌కు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో జయశంకర్‌సార్ జయంతిని బీఆర్‌ఎస్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాలకు జయశంకర్‌సార్ ప్రత్యక్ష సాక్షి అని, జీవితాంతం రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా పరితపించిన మహనుభావుడు అని కొనియాడారు. కేసీఆర్‌తో కలిసి సార్ ఢిల్లీలో తెలంగాణకు అనుకూలంగా దేశంలోని 36 రాజకీయ పార్టీలను ఒప్పించి లేఖలు ఇప్పించటంలో క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. సార్ జీవిత లక్ష్యాన్ని కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సమాజం సాధించిందని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్‌సార్ పేరుపెట్టి కేసీఆర్ ఘన నివాళి అర్పించారని చెప్పారు. తెలంగాణ సమాజానికి, బీఆర్‌ఎస్‌కు సార్ ఆశీస్సులు ఉండాలని కాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రేరణతో పునరంకితం

- **బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి**
- **తెలంగాణ భవన్‌లో జయశంకర్ జయంతి**

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో పునరంకితం కావాలని శాసనమండలి బీఆర్‌ఎస్‌పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో జయశంకర్‌సార్ చిత్రపటానికి ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దేశపతి మాట్లాడుతూ తెలంగాణతల్లి తన కోసం నియమించుకున్న అడ్వకేట్ జయశంకర్ అని పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమశక్తులను ఏకం చేయటంలో సార్ క్రియాశీల పాత్ర పోషించారని గుర్తుచేశారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణకు జరిగిన అన్యాయాలను రికార్డు చేసిన గొప్ప ఆలోచనాపరుడని కొనియాడారు. బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వరంగల్ ఏఎస్పీగా ఉన్న సమయంలో సార్‌ను కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, రాకేశ్, గెల్లు శ్రీనివాస్, గజ్జెల నగేశ్, ఆంజనేయగౌడ్, అనిల్ కూర్మాచలం, వాల్యానాయక్, వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో..

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

15 రోజుల్లో ఆడిట్ పూర్తి చేయండి

- **మార్క్‌ఫెడ్‌కు తుమ్మల ఆదేశం**
- **'నమస్తే తెలంగాణ' కథనంపై మంత్రి స్పందన**

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): ఎరువుల సరఫరాపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్‌ను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎరువుల సరఫరాపై ఆడిట్ జరగకపోవడంతో కొందరు ఉద్యోగులు ఎరువుల సొమ్మును నొక్కేస్తున్నారంటూ 'ఆడిట్ లేదు... అరాచకమే' శీర్షికన ఈ నెల 4న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించిన నేపథ్యంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేయాలని చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైనా చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది.

20 గంటల్లోనే 30 వేలు

- **రుణమాఫీపై బీఆర్‌ఎస్ వాట్సాప్ నంబర్ 83748 52619కు ఫిర్యాదుల వెల్లువ**
- **వివరాలు పంపుతున్న రైతులు**
- **రేషన్‌కార్డు లేకపోతే రుణమాఫీ లేనట్టే!**



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రూ.లక్షన్నర వరకు రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన వాట్సాప్ నంబర్ 83748 52619కు కేవలం 20 గంటల్లోనే దాదాపు 30 వేల ఫిర్యాదులు అందడం పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నది. రూ.లక్షన్నర మాఫీపై ప్రభుత్వం చెప్తున్నదానికీ, క్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితులకు పొంతన లేదనడానికి ఈ ఫిర్యాదులే నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందజేస్తున్నారు. రుణమాఫీకి, రేషన్‌కార్డుతో సంబంధంలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహా మంత్రులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని వస్తున్న ఫిర్యాదులు స్పష్టం చేస్తున్నాయి. చిన్న చిన్న సాంకేతిక అంశాలను చూపి తమకు రుణమాఫీ చేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాలో ఇంటిపేరు, అసలు పేరు, పేరు చివరన కుల ప్రస్తావన ఇలా అన్నీ మ్యాచ్ కావాలి... ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా రుణమాఫీ చేసేది లేదన్నట్టుగా సర్కార్ వ్యవహరిస్తున్నది.

బీఆర్‌ఎస్ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల్లో మచ్చుకు కొన్ని..

- మాది జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం. నాకు 2.20 ఎకరాల భూమి ఉన్నది. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌లో నా పేరు పెద్దిరాజు గౌడ్ అని ఉన్నది. బ్యాంకులో పెద్దిరాజు అని ఉన్నది. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రుణమాఫీ డబ్బులు ఇదే ఖాతాలో పడ్డాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆధార్‌కార్డులో ఉన్న పేరుకు బ్యాంకులో ఉన్న పేరు మ్యాచ్ కావడం లేదంటూ రుణమాఫీ చేయలేదు. నాకు రుణమాఫీ వచ్చేలా చూడండి
- నాపేరు కల్వకోలు సురేందర్‌రెడ్డి. మాది కొంగరకలాన్. నాకు పంట రుణం రూ.లక్ష వరకే ఉన్నది. కానీ ఇంత వరకు మాఫీ కాలేదు.
- నా పేరు ఆకుల దామోదర్. మాది వికారాబాద్ జిల్లా చౌడారం మండలం అడవివెంకటాపూర్ గ్రామం. నాకు క్రాప్‌లోన్ రూ. 54 వేలే ఉన్నది. ఇంకా మాఫీ కాలేదు.
- మాది పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూర్. నాపేరు దరావత్ కిశోర్. బ్యాంకులో రూ.లక్షా 26 వేల అప్పు ఉన్నది. నాకు రేషన్‌కార్డు లేదని రుణమాఫీ కాలేదు.

రుణమాఫీ జాబితా తప్పుల తడక

- **రైతుల జాబితా కూడా సరిగ్గా రూపొందించలేరా?**
- **వేల కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం లేదు**
- **మీ వల్ల ప్రభుత్వం బద్నాం**
- **టెస్కాబ్‌పై తుమ్మల ఆగ్రహం**
- **16 మంది ప్యాక్స్ కార్యదర్శుల సస్పెన్షన్**

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): రుణమాఫీలో రైతుల జాబితా మొత్తం తప్పుల తడకగా ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. 'కనీసం రైతుల జాబితా కూడా సరిగ్గా చేయలేరా? ఎందుకీ తప్పులు జరిగాయి?' అంటూ టెస్కాబ్ సీజీఎం జ్యోతిని నిలదీసినట్టు సమాచారం. మంగళవారం ఆయన సచివాలయంలో రుణమాఫీపై టెస్కాబ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'రుణమాఫీలో టెస్కాబ్ పూర్తిగా విఫలమైంది.. మీ వైఫల్యం వల్ల ప్రభుత్వం బద్నాం అవుతున్నది. రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా.. టెస్కాబ్ తప్పిదాల వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు' అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రుణమాఫీ సమస్యల్లో మెజార్టీ టెస్కాబ్ అనుబంధ బ్యాంకులవే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పులన్నీ సరిచేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది.

13 మంది కార్యదర్శులపై చర్యలు

రుణమాఫీలో తప్పుడు లెక్కలు సమర్పించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 16 మంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో 13 మంది కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఈ మేరకు సహకార శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన 16 సంఘాల కార్యదర్శులు తప్పుడు లెక్కలు సమర్పించినట్టు, రుణాలు తీసుకోకపోయినా, రుణమాఫీ గడువులో రుణం లేని వాటిని కూడా జాబితాలో పొందుపరిచినట్టు గుర్తించారు. దీంతో వారిపై చర్యలకు ఉపక్రమించారు. మరో 105 మంది కార్యదర్శులు అసలు, వడ్డీల లెక్కలు తప్పుగా పంపించినట్టు గుర్తించి వారిని వివరణ కోరారు. రుణమాఫీలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఐవోబీ మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

15న 2 లక్షల రుణమాఫీకి ప్రయత్నం

- **వైరాలో సీఎం రేవంత్‌తో చేయించేలా ఆలోచన**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఈ నెల 15 వరకు ప్రతి రైతుకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామన్న మాటపై ప్రభుత్వం నిలబడే సూచనలు కనిపించడం లేదు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 15న రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. వైరాలో గోదావరి జలాలను ఖమ్మంకు అందించే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయించాలని వ్యవసాయ శాఖ ఆలోచన చేస్తున్నదని తెలిపారు. మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, ఇందులో సుమారు ఆరు లక్షల మంది రైతులకు రూ.ఆరు వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని వెల్లడించారు. ఈ లెక్క ప్రకారం మూడు విడతల్లో కలిపి ప్రభుత్వం 23.74 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసినట్టవుతుంది. ఈ లెక్కన రుణమాఫీ కోసం ప్రభుత్వం చేసే ఖర్చు రూ.18 వేల కోట్లు మాత్రమే కావడం గమనార్హం.

30 వేల మందికి రుణమాఫీ కాలేదు

గత నెల 29న చేసిన రూ.1.5 లక్షల వరకు రెండో విడత రుణమాఫీలో సాంకేతిక కారణాలతో 30 వేల మంది రైతులకు సాధ్యం కాలేదని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో రూ. లక్ష వరకు రుణమాఫీలో 17 వేల ఖాతాలకు రుణమాఫీ కాలేదని, రూ.84 కోట్లు ప్రభుత్వానికి రిటర్న్ వచ్చాయని వివరించారు. 10 వేల ఖాతాలను సరి చేసి రూ.44 కోట్లు తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఏడు వేల ఖాతాల సమస్యను పరిష్కరించాల్సి ఉన్నదని చెప్పారు. సాంకేతిక తప్పిదాలతో రుణమాఫీ కాని రైతుల కోసం ఈ నెల 15 తర్వాత కార్యాచరణ ప్రారంభిచనున్నట్టు తెలిపారు.

తప్పిదాలకు బ్యాంకులదే బాధ్యత

రుణమాఫీలో తప్పిదాలకు బ్యాంకులే బాధ్యత వహించాలని మంత్రి స్పష్టంచేశారు. అప్పు ఉన్న రైతుల ఖాతాల వివరాలు ఇవ్వాలని మే నెలలోనే బ్యాంకులను కోరినట్టు తెలిపారు. బ్యాంకర్లు పంపిన వివరాల ప్రకారమే రుణమాఫీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. సరైన వివరాలు ఎందుకు పంపించలేదు? ఇందుకు కారణాలేమిటి? అనే అంశంపై వివరణ ఇవ్వాలని బ్యాంకులను కోరినట్టు తెలిపారు. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు.

2022 మే తర్వాత తీసుకున్న రుణాలనే మాఫీ చేయాలి

2022 మే 6న వరంగల్ రైతుసభలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్‌ను విడుదల చేశారని, నాడు ఇచ్చిన హామీ ప్రకారం.. 2022 మే తర్వాత తీసుకున్న రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని తుమ్మల చెప్పారు. ఐదేండ్ల క్రితం తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేస్తున్నామని తెలిపారు.

అప్పుచేసి కడుతున్నారనుకుంటే ఎలా?

రుణమాఫీలో భాగంగా రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ముందుగా చెల్లించాలన్న నిబంధనతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, పెట్టుబడి కాలం కావడంతో అప్పు చేసి మరీ మొత్తం చెల్లిస్తున్నారని, ఈ నిబంధనను సడలించాలంటూ రైతు సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను మీడియా ప్రతినిధులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి... 'రైతులు ఇంట్లో ఉన్నవి కట్టారేమో నాకేం తెలుసు? అందరూ అప్పు తెచ్చి కట్టారని మీరెలా అనుకుంటారు?' అంటూ ఎదురు ప్రశ్నించడం గమనార్హం. రూ.2 లక్షలకు ఎక్కువ ఉన్న మొత్తాన్ని చెల్లించి ఆ తర్వాత పది లక్షలు తీసుకో అది మీ ఇష్టం అంటూ రైతులకు సలహా ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు రైతులను కించపరిచేలా ఉన్నాయని రైతులు, రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మా రుణాలెందుకు మాఫీకాలె?

బ్యాంకు మేనేజర్‌ను నిలదీసిన రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: అర్హతలున్నా రుణం ఎందుకు మాఫీ కాలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్‌ను మంగళవారం రైతులు నిలదీశారు. బ్యాంకులో ఖాతాలు ఉన్న 30 మంది రైతులు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరితో కలిసి బ్యాంకుకు చేరుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు అన్ని అర్హతలు ఉన్నా రెండు విడతల్లో తమ పేర్లు ఎందుకు రాలేదని మేనేజర్‌ను నిలదీయడంతోపాటు కారణాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతికంగా సమస్య తలెత్తిందని, ఆ సమస్యను అధిగమించి త్వరలోనే అందరికీ మాఫీ అయ్యేలా చూస్తామని బ్యాంకు అధికారులు చెప్పడంతో రైతులు శాంతించారు.

ఫలితమివ్వని గ్రీవెన్స్ కమిటీ

- **రైతులు ఫిర్యాదులు చేసినా స్పందన కరువు**
- **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 300కు పైగా ఫిర్యాదులు**

మేడ్చల్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ వర్తింపుకాని రైతుల కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీతో ఎలాంటి ఫలితం లేదని రైతులు మండిపడుతున్నారు. రెండు విడతలుగా రుణమాఫీకాని రైతులు గ్రీవెన్స్ కమిటీలో ఫిర్యాదులు చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా బౌరంపేట్, దూలపల్లి, డబిల్‌పూర్, మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్‌లో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో ఇప్పటి వరకు 3,091 మంది రైతులకు రూ. 17 కోట్లు మాత్రమే రుణమాఫీ అయింది. రుణమాఫీకాని రైతులు 300 మంది గ్రీవెన్స్ కమిటీలో ఫిర్యాదులు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య వేలల్లో ఉన్నా అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు ఇచ్చిన రైతులకు ఎలాంటి సమాధానాలు అధికారులు ఇవ్వలేదని చెప్పారు. గ్రీవెన్స్ కమిటీలో రైతుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించినా కింది స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల చివరివారంలో అందిస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఎంత మందికి వర్తింపజేస్తారన్న ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

రైతుభరోసా ఇప్పట్లో ఇవ్వలేం

➤ మొదటిపేజీ తరువాయి...

స్పష్టత రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పంట వేయని భూములకు రైతుబంధు రూ.25 వేల కోట్లు ఇచ్చారని, వాటిని రికవరీ చేయబోమని స్పష్టంచేశారు.

రైతుల ఎదురుచూపులు

వానకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైతులు సాగు పనుల్లో బీజీ అయిపోయారు. సగం పంటల సాగు కూడా పూర్తయింది. దీంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాగు సమయంలో పెట్టుబడి సాయం పంపిణీ చేస్తే ఎరువులు, విత్తనాలు, దుక్కి ఖర్చులు, కూలీలకు ఇలా ఏదో ఒకరకంగా రైతులకు ఆ డబ్బులు ఉపయోగపడుతాయి. రైతుబంధు (రైతుభరోసా) ముఖ్య ఉద్దేశం కూడా ఇదే. కానీ ప్రభుత్వం మాత్రం పెట్టుబడి సాయంపై కాలయాపన చేసే దిశగా సాగుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీలో చర్చేది... కమిటీ రిపోర్టు ఏదీ?

రైతుభరోసాపై ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. ఇందుకు అభిప్రాయ సేకరణ అని ఒకసారి, అసెంబ్లీలో చర్చ అని మరోసారి, మంత్రుల కమిటీ అని ఇంకోసారి సాకులు చెప్పున్నదనే విమర్శలున్నాయి. మొన్నటివరకు రైతుభరోసాపై అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చించి ఆ తర్వాత రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు ప్రకటించారు. కానీ అసెంబ్లీలో రైతుభరోసా అంశమే చర్చకు రాలేదు. మంత్రులతో సబ్ కమిటీ వేశామని, ఆ కమిటీ అసెంబ్లీ సమావేశాల వరకు అన్ని జిల్లాలు పర్యటించి రైతుల అభిప్రాయాలు సేకరించి నివేదిక ఇస్తుందని, దాని ఆధారంగానే పంపిణీ చేస్తామని చెప్తూ వచ్చారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయినా, మంత్రుల కమిటీ నివేదిక మాత్రం ప్రభుత్వానికి అందలేదు.

సీఎం రేవంత్ గద్దె దిగాలి

- **8 నెలలైనా హామీలు బుట్టదాఖలు**
- **ప్రజాభవన్‌లో మహిళల ఆగ్రహం**

జూబ్లీహిల్స్, ఆగస్టు 6: ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీల హామీల అమలులో పూర్తిగా విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని పలువురు మహిళలు మండిపడ్డారు. మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చిన ముస్లిం మైనార్టీ మహిళలు ప్రజాపాలనలో 8 నెలల క్రితం ఇచ్చిన తమ దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీశారు. బాలానగర్ చింతల్‌కు చెందిన షను, కుత్బుల్లాపూర్‌కు చెందిన తాహెరా బేగం మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ ఇప్పటికీ అందలేదని, రూ.500కు సిలిండర్ ఉత్త గ్యాసేనని ఎద్దేవా చేశారు. బస్సు ఫ్రీ ఇస్తే మహిళలకు సీటులేదని వాపోయారు. మహిళలకు రూ.2500పథకం బూటకమని దుయ్యబట్టారు. 100 రోజులలో చేస్తామన్న పథకాలు 8నెలలైనా అమలు జరుగలేదని, రేవంత్ పాలన బేకార్ అని వ్యాఖ్యానించారు. మళ్లీ కేసీఆర్, కేటీఆర్‌ను దించుతామని.. రేవంత పాలనలో భద్రత కూడా కరువయ్యిందని ఏకరువు పెట్టారు..

ప్రజాభవన్ వద్ద మాట్లాడుతున్న మహిళలు షను, తాహెరా బేగం

5,200 వేతనంతో ఎట్లా బతికేది?

ఉపాధి హామీ పథకం అటెండర్ల ఆవేదన

ప్రజాభవన్, ఆగస్టు 6 : ప్రజాపాలన తెస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 8 నెలలుగా ఉపాధి హామీ సిబ్బంది వేతనాల ఊసే ఎత్తడంలేదని.. ప్రజావాణి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని సంబంధిత ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టీఎంఎ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, షేక్ బీపాషా ఆధ్వర్యంలో ప్రజాభవన్‌కు చేరుకున్న సిబ్బంది ప్రభుత్వం ఇచ్చే రూ.5200 జీతంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల్లో నియమితులైన 540 మంది ఎంసీసీ అటెండర్ల జీతభత్యాలు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణాలే సరిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రుణమాఫీ ఎర్రర్ లిస్ట్ ఎందుకు పంపలే?

- **పీఏసీఎస్ సిబ్బందిపై డీసీవో ఫైర్**
- **ప్యాక్స్‌లో ఘరానా మోసంపై విచారణ**

నమస్తే ఎఫెక్ట్

గండీడ్, ఆగస్టు 6 : 'మీ నిర్లక్ష్యం వల్ల రైతులకు ఇబ్బందులు రావొద్దు' అని డీసీవో పద్మ మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బందికి సూచించారు. లోన్ తీసుకోకపోయినా రుణమాఫీ లిస్ట్‌లో పేరు వచ్చిందని ఫోన్‌కు మెసేజ్‌లు వస్తున్నాయంటూ సోమవారం రైతులు ఆందోళన చేయడంతో 'నమస్తే తెలంగాణ'లో 'పీఏసీఎస్‌లో ఘరానా మోసం!' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డీసీవో మంగళవారం గండీడ్ పీఏసీఎస్‌ను సందర్శించారు. రుణమాఫీలో అవకతవకలపై వివరాలు సేకరించారు. రుణమాఫీ లిస్ట్ వెంటనే పంపించాలని, సరిగ్గా పనిచేయకపోతే వేటు తప్పదంటూ హెచ్చరించారు.

IHMI | MINISTRY OF TOURISM | NCHMCT

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ & అప్లైడ్ న్యూట్రిషన్

(పర్యాటక మంత్రిత్వ శాఖ క్రింద స్వయంప్రతిపత్తి గల సంస్థ, భారత ప్రభుత్వం)

"F" Row, D.D. Colony, Vidyanagar, Hyderabad. TG State. Ph: 040-27427569, Mobile: 8374787988. E-mail: ihmhyd.principal@gmail.com, Web : www.ihmhyd.org

NCHMCTతో అనుబంధమై ఉన్న IHM-హైదరాబాద్‌లో మిగిలిన ఖాళీలపై దిగువ తెలిపిన అర్హత ప్రమాణాలతో 3 సంవత్సరాల B.Sc.-HHA (హాస్పిటాలిటీ & హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ యొక్క 1వ సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు అర్హత గల అభ్యర్థుల నుండి నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ, నోయిడ తరపున IHM-హైదరాబాద్ దరాఖాస్తులు కోరుతున్నది.

1. అభ్యర్థి కనీసం 40% మార్కులు (మొత్తంలో, గుర్తింపుపొందిన బోర్డు నుండి 10+2 సిస్టమ్‌లో, ఏదేని స్ట్రీమ్‌లో (సైన్స్/ఆర్ట్స్/కామర్స్/వొకేషనల్)తో 12 పరీక్షలు ఉత్తీర్ణులై ఉండాలి.
2. 12వ లెవల్‌లో ఇంగ్లీష్ తప్పనిసరి సబ్జెక్టుల్లో ఒకటై ఉండాలి మరియు సదరు సబ్జెక్ట్ అభ్యర్థి ఉత్తీర్ణుడై ఉండాలి.
3. ఎలాంటి వయోపరిమితి లేదు.
4. ఫైనల్ డిగ్రీ ప్రధానం చేయుటకు సదరు ప్రోగ్రామ్ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీచే గుర్తింపుపొందినది.
5. ప్రభుత్వ రూల్స్ ప్రకారం రిజర్వేషన్ ఉంటుంది.

ఆసక్తి గల అభ్యర్థులు 14 ఆగస్టు 2024లోగా స్వయంగా/పోస్ట్ ద్వారా లేదా **ihmhyd.principal@gmail.com** వద్ద ఇమెయిల్ ద్వారా యోగ్యతాపత్రాల కాపీలను జతచేసి ఇన్‌స్టిట్యూట్‌కు తప్పనిసరి దరఖాస్తు చేయవలెను. అడ్మిషన్ ఫారం మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ **www.ihmhyd.org**లో లభిస్తాయి. అడ్మిషన్ హెల్ప్‌లైన్ నెం. 8374787988, సంప్రదించు వ్యక్తి పేరు: **శ్రీమతి అరుణ/శ్రీ ప్రేమ్ సాగర్**, మొబైల్ నెం. 9059440793.

అడ్మిషన్ అర్హతగల దరఖాస్తుదారులకు మిగిలిన ఖాళీల కొరకు NCHMCT ద్వారా నిర్వహించబడు వ్రాతపూర్వక పరీక్ష ఆధారంగా ఆఫర్ చేయబడును. అభ్యర్థులు వ్రాతపూర్వక పరీక్ష షెడ్యూల్‌పై సమాచారం కొరకు ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌ను అనుసరించండి.

సం/- ప్రిన్సిపాల్/సెక్రటరీ